

రూ.2 లక్షల విరాళం

గోకవరం: స్థానిక పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.2 లక్షల విరాళం అందించారు.




అంగరంగ వైభవం

అంతర్వేదిలో లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

8లో

సాగుకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మహా కుంభమేళాకు మూడు బస్సులు



బస్సులను ప్రారంభించిన డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాగ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి మూడు సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సులు 108 మంది భక్తులతో బయలుదేరాయి. డిపో మేనేజర్ షేక్ షబ్నంతో కలసి జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) షర్మిల అశోక మంగళవారం జెండా ఊపి ఈ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుంభమేళా యాత్ర భక్తులు భువనేశ్వర్, పూరి, కోణార్క్, గయ, బుద్ధ గయ, వారణాసి, అరసవిల్లి క్షేత్రాలను దర్శిస్తారన్నారు. వీరు ఈ నెల 12న రాజమహేంద్రవరం చేరుకుంటారన్నారు. ఒక్కో బస్సులో 36 మంది భక్తులు బయలుదేరారని తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని సమగ్ర శిక్షాలో సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లానింగ్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూల్ కో ఆర్డినేటర్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (మహిళ) పోస్టులను భర్తీ చేయనున్నామని వివరించారు. పాఠశాల విద్యా విభాగంలో పని చేస్తున్న 55 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, కనీసం ఎనిమిదేళ్ల సర్వీసు ఉన్న స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే దీనికి అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ఈ నెల 10వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు రాజమహేంద్రవరంలో సమగ్ర శిక్షా ఏఎస్‌వో వైవీ ప్రసాదరావును నేరుగా లేదా 94419 08345 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని సుభాషిణి తెలిపారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ



క్యాన్సర్ దినోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్యకరమైన జీవన శైలి, ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికా రి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఆయన బొమ్మూరులోని తన కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, ప్రతి పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మూడు రకాల క్యాన్సర్ల నివారణకు గత ఏడాది నవంబర్ 14 నుంచి 8 నెలల ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వీటిని ఉచితంగా చేస్తామన్నారు. ఇంటింటా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వేలో వైద్య బృందం ప్రతి ఇంటికీ వెళ్లి, వారి ఆహార అలవాట్లు, మెడికల్ హిస్టరీ అడిగి తెలుసుకుంటాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ బీపీ, సుగర్, ఎనీమియా, నోటి, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు వారి ఇళ్ల వద్దనే చేస్తారని వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిప్రసాద్, ఎపిడమాలజిస్ట్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా జనరల్ విభాగంలో 77 కేంద్రాల్లోను, ఒకేషనల్‌లో మొదటి విడతగా 12 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియెట్ విద్య జోన్-1, 2 ఆర్జేడీ ఐ.శారద, జిల్లా వృత్తి విద్యాధికారి జేఎస్‌వీవీ సుబ్రహ్మణ్యం, ప్రాంతీయ ఇంటర్మీడియెట్ అధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లూ చేశారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకూ జనరల్ విభాగం, 5 నుంచి 20వ తేదీ వరకూ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ 13,202 మంది, బైపీసీ 3,168 కలిపి మొత్తం 16,370 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరం 2,226 మంది, ద్వితీయ సంవత్సరం 1,875 మంది హాజరు కానున్నారు.



● 'తూర్పు'.. తిరిగి దండమేనా!

చిన్నమ్మా.. చేతకాలేదా?



కొవ్వూరు రైల్వే స్టేషన్

- రాజమహేంద్రవరం ఎంపీగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు
- అయినప్పటికీ పురందేశ్వరి నియోజకవర్గంపై చిన్నచూపు
- రైల్వే బడ్జెట్‌లోనూ మొండిచేయే..
- పట్టాలెక్కని నూతన ప్రాజెక్టులు
- 2027లో గోదావరి పుష్కరాలు
- అయినా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధుల కరువు

చిన్నమ్మకు కేంద్రం నుంచి నిధులు రాబట్టడం చేతకావడం లేదా.. ఎంపీగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదా.. బీజేపీ పెద్దల వద్ద ఆమె మాట చెల్లడం లేదా.. టీడీపీ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారనే అనుమానంతో చిన్నమ్మను కేంద్రం దూరం పెట్టిందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది రాజకీయ విశ్లేషకుల నుంచి. ఇటీవలి కేంద్ర బడ్జెట్టే దీనికి నిదర్శనంగా నిలుస్తూండగా.. రైల్వే బడ్జెట్‌లో సైతం జిల్లాకు కేటాయింపులు లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్

సాక్షి, రాజమహేంద్రవరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో వలస వచ్చినా ఇక్కడి ప్రజలు ఆమెను ఆదరించారు. 54.82 శాతం ఓట్లు వేసి, 2,39,139 ఓట్ల మెజార్టీతో పట్టం కట్టారు. ఆమె ద్వారా జిల్లాకు మరిన్ని మంచి రోజులు వస్తాయని, తమ గళం ఢిల్లీ వరకూ వినిపిస్తుందని భావించారు. కానీ, ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. తనపై అంత అభిమానం చూపిన జిల్లా ప్రజల అభ్యున్నతి, అభివృద్ధిపై చిన్నమ్మ కనీస శ్రద్ధ కూడా చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కుబడిగా సమావేశాలకు రావడం, వెళ్లడం తప్ప గోదారోళ్ల గుండె ఘోష తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనమని పలువురు పెదవి విరుస్తున్నారు. స్వయానా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధికే నిధులు రాబట్టుకోలేని చిన్నమ్మ నిస్సహాయతను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. కనీసం రైల్వే అభివృద్ధికి కూడా పాటు పడిన దాఖలాలు లేకపోవడంతో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు అలాగే మిగిలిపోయాయి.

ప్రత్యామ్నాయ మార్గం ప్రస్తావనేదీ?

రాష్ట్రంలో రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రతి రోజూ సుమారు 200కు పైగా ప్రయాణికుల, గూడ్సు రైళ్లు ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తూంటాయి. మామూలు రోజుల్లో 30 వేల మంది, పండగ సమయాల్లో 40 వేల మందికి పైగా ప్రయాణికులు రైళ్లలో రాకపోకలు సాగిస్తూంటారు. ఆదాయంలోనూ ఈ స్టేషన్ మేటిగా నిలుస్తోంది. ఏటా రూ.123 కోట్లకు పైగా ఆదాయంతో ఎన్ఎస్‌జీ-2 హోదా సొంతం చేసుకుంటోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం బడ్జెట్‌లో నయా పైసా కూడా కేటాయించకపోవడం గమనార్హం. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో ట్రాక్‌లు నిత్యం రైళ్ల రాకపోకలతో రద్దీగా ఉంటాయి. ఈ దృష్ట్యా గోదావరి బ్రిడ్జిల పైన, కొవ్వూరు, ఔటర్‌లోను పలు సందర్భాల్లో రైళ్లను నిలిపివేస్తూ, ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి కడియం నుంచి నిడదవోలు వరకూ ప్రత్యామ్నాయ రైల్వే లైన్ వేయాలనే ప్రతిపాదన ఉంది. తద్వారా గూడ్స్ రైళ్లను అటు మళ్లించడంతో రాజమండ్రి స్టేషన్‌కు ట్రాఫిక్ ఒత్తిడి లేకుండా చేయవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, ఈ రైల్వే లైన్ నిర్మాణ విషయం బడ్జెట్‌లో ప్రస్తావనకు రాలేదు. నిధుల కేటాయింపుపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

గత నిధులనే ఇప్పుడిచ్చినట్లు!

రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.271 కోట్లు కేటాయించారు. పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ప్రస్తుత రైల్వే బడ్జెట్‌లో మరోసారి కేటాయింపులు ఉంటాయని భావించారు. కానీ, గతంలో మంజూరైన నిధులనే కొత్తగా ఇచ్చినట్లు కలరింగ్ ఇచ్చారు. కేంద్రం తెలివితేటలు చూసి, జిల్లా ప్రజలు విస్మయానికి గురవుతున్నారు.

ఆర్వోబీల ఏర్పాటుపై నీలినీడలు

రైల్వే గేట్ల వద్ద ప్రమాదాలు నివారించాలంటే ఆర్వోబీల నిర్మాణం చేపట్టాలని రైల్వే శాఖ భావించింది. దీనికి గాను 2027 నాటికి గేట్లను తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం నగరంలోని అన్నపూర్ణమ్మపేట, కేశవరం, అనపర్తి ఆర్వోబీల ఏర్పాటుకు రైల్వే శాఖ పంపిన ప్రతిపాదనలకు తాజా బడ్జెట్‌లో దిక్కూమొక్కూ లేకుండా పోయింది.

కొవ్వూరు – కొత్తగూడెం రైల్వే లైన్ ఊసే లేదు

విశాఖపట్నం నుంచి హైదరాబాద్ మధ్య ప్రయాణ దూరాన్ని సుమారు 130 కిలోమీటర్ల మేర తగ్గించాలనే ఉద్దేశంతో కొవ్వూరు నుంచి భద్రాద్రి జిల్లా కొత్తగూడెం వరకూ కొత్త రైల్వే లైన్ నిర్మాణాన్ని చాలా కాలం కిందటే ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన ఇటీవల తిరిగి పట్టాలెక్కినట్టు కనిపించింది. దీని సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరిగింది. ఈ రైల్వే లైను నిర్మాణం అన్నివిధాలుగా ఉపయోగకరమని నివేదికలు సైతం స్పష్టం చేశాయి. దీనికి ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని భావించినా నిరాశే ఎదురైంది.

పుష్కర నిధులపై స్పష్టత ఏదీ?

గోదావరి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది. పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు రూ.1,286 కోట్లు అవసరమని ప్రజాప్రతినిధులు, అధికారులు లెక్కలు వేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరుగుతుందని భావించారు. కానీ, ఎటువంటి ప్రకటనా లేకపోవడంతో అసలు పుష్కరాలకు కేంద్రం తన వాటా ఇస్తుందా, లేదా.. ఇస్తే ఏ మేరకు అనే ప్రశ్న తలెత్తుతోంది. పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమీక్ష నిర్వహించిన ఎంపీ పురందేశ్వరి నిధుల మంజూరుపై దృష్టి సారించలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అలాగే, రైల్వే సమస్యలపై కూడా ఆమె ఎందుకు శ్రద్ధ చూపలేదని ప్రశ్నిస్తున్నారు.

గోదావరి స్టేషన్ గాలికేనా?

గోదావరి పుష్కరాలు 2027లో జరగనున్నాయి. దీనికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాదిగా భక్తులు వస్తారు. పుష్కర ఘాట్‌కు అత్యంత సమీపాన గోదావరి స్టేషన్ ఉంది. పుష్కరాలకు వచ్చే భక్తులు ఎక్కువగా ఇక్కడే దిగి, గోదావరి పుణ్యస్నానాలకు వెళ్తాంటారు. ఆ సమయంలో ప్రత్యేక రైళ్లను నడుపుతారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గోదావరి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.



గోదావరి రైల్వే స్టేషన్

అమృత్ స్టేషన్ల అభివృద్ధేదీ?

అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా నిడదవోలు జంక్షన్, కొవ్వూరు, రాజమండ్రి, కడియం, ద్వారపూడి (కోనసీమ జిల్లా), అనపర్తి స్టేషన్ల అభివృద్ధికి ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. ప్రకటనలే తప్ప ఈ పనులు నత్తకు మేనత్తలా మారాయి. ప్రస్తుత బడ్జెట్‌లో వీటికి భారీగా నిధులు కేటాయిస్తారని భావించారు. కానీ, నయాపైసా కూడా ఇవ్వలేదు.

పోలవరం ఎత్తు తగ్గిస్తే చరిత్ర హీనులవుతారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వనజ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): కేంద్రానికి తలొగ్గి పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే కూటమి ప్రభుత్వంలోని నాయకులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ డ్యామ్ ఎత్తును ముందు ఆమోదించిన డిజైన్ ప్రకారం 45.72 మీటర్ల ఎత్తున నిర్మిస్తేనే దాని ప్రయోజనాలు రాష్ట్రానికి అందుతాయన్నారు. అంతే కానీ ఎత్తును 41.15 మీటర్లకు తగ్గిస్తే ఉపయోగం ఉండదని చెప్పారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించిందంటూ నానా రాద్ధాంతం చేసిన చంద్రబాబు ఇప్పుడు ఏవిధంగా ఎత్తు తగ్గిస్తారని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌కు ముందే వచ్చిన ఆర్థిక సర్వే ప్రకారం జాతీయ అభివృద్ధి తిరోగమనంలో ఉందని, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తోందని వనజ చెప్పారు. ఉద్యోగుల వేతనాలు పెరగకపోగా ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయని చెప్పినప్పటికీ, ఆ నివేదికను ఎంత మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు కేటాయింపులు తగ్గాయని, రైతులకు మద్దతు ధర ఊసే లేదని విమర్శించారు. దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రతరమవుతున్నాయని, కొద్ది మంది చేతుల్లో సంపద కేంద్రీకృతమై, రూపాయి పతనం దిశగా వెళ్తోందని, ద్రవ్యోల్బణం పెరుగుతోందని చెప్పారు. 64 శాతం జీడీపీతో వికసిత భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న అంశాలకు నిధులు రాబట్టడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, రాజధాని అమరావతికి నిధులివ్వకుండా అప్పు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ రైల్వే జోన్, విశాఖ మెట్రో, కడప స్టీల్ ఫ్యాక్టరీ వంటి వాటికి నిధులివ్వలేదని తూర్పారబట్టారు. అమిత్ షా చేపడుతున్న కగార్ ఆపరేషన్‌ను అన్ని వర్గాల వారూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని వనజ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి.కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



టాస్ వేసి, పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు జరిగే అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలను ఇన్‌చార్జ్ ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు తమిళనాడు రాష్ట్రం సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, తూర్పుగోదావరి హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రిఫరీ బోర్డు చైర్మన్ పి.దిలీప్ కుమార్, పరిశీలకుడు వీఎస్ దేవానంద్, సెలక్షన్ కమిటీ సభ్యులు పి.శ్రీను, సీహెచ్ అంజిబాబు, పీఈటీ డాక్టర్ బి.రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ధ్వజమెత్తారు. నెరవేర్చిన హామీలను కూడా అరకొరగా నెరవేర్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా హామీల అమలుకు చర్యలు చేపట్టలేదన్నారు. అధికారంలోకి వచ్చేందుకు అనేక వాగ్దానాలు ఇచ్చి, ఇప్పుడు సంపద సృష్టించలేదని, అప్పులు పెరిగిపోయాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిని బట్టి చూస్తూంటే ఎన్నికల్లో గెలిచేందుకు తప్పుడు హామీలు ఇచ్చారనే అనుమానం కలుగుతోందన్నారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకు వస్తానన్న సీఎం చంద్రబాబు ఇప్పటి వరకూ ఆ ఊసే తేలేదన్నారు. గీత కులాలు కల్లు గీత సంప్రదాయ వృత్తిని కొనసాగిస్తున్నాయని, గౌడ, ఈడిగ, గౌడ్ (గమల), కలాలీ, శ్రీశయన (సెగిడి), శెట్టిబలిజలకు సంబంధించి విడుదల చేసిన జీవో నంబర్-13లో లొసుగులను సవరించాలని ఆయన కోరారు. న్యాయపరమైన చిక్కుల పేరుతో కాలయాపన తగదని, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే, 50 శాతం రాయితీతో మద్యం దుకాణాలు కేటాయించాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఈ కులాలకు అవసరమైన రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తే గీత కార్మికుల పక్షాన నిలిచి, తమ పార్టీ తరఫున న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన జరపాలని కోరారు. తద్వారా బీసీల శాతం తెంతో తెలుస్తుందన్నారు. బీసీల్లో కులాల వారీగా కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోతే తమ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. తనపై 28 కేసులు పెట్టారని, వీటిపై న్యాయపోరాటం చేస్తానని రామచంద్ర యాదవ్ చెప్పారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికులు

- ఉచితంగా నమోదు చేయాలి
- ఇప్పటి వరకూ 3.20 లక్షల మంది నమోదు
- జిల్లా కలెక్టర్ ప్రశాంతి



ఈ-శ్రమ్ పోర్టల్‌పై వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచితంగా నమోదు చేసుకునేలా అసంఘటిత కార్మికులందరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికుల నమోదుపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఈ-శ్రమ్ పోర్టల్‌లో 6 లక్షల మందిని నమోదు చేయాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకూ 3.20 లక్షల మంది నమోదయ్యారని చెప్పారు. జిల్లా అధికారులు ఆయా శాఖల్లో పని చేస్తున్న వారి జాబితా ప్రకారం ఈ-శ్రమ్‌లో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ-శ్రమ్ నమోదుకు 16 నుంచి 59 సంవత్సరాల మధ్య కార్మికులు అర్హులని తెలిపారు. ఈ-శ్రమ్‌లో నమోదైన కార్మికులకు ఉచిత గుర్తింపు కార్డు జారీ అవుతుందన్నారు. ఈ-శ్రమ్ పథకంలో నమోదైన వలస కార్మికులు ఏ రాష్ట్రం వారైనా, రేషన్ కార్డు లేకపోయినా పౌర సరఫరాల శాఖ ద్వారా రేషన్ కార్డులు, నిత్యావసర సరకులు అందజేస్తారని వివరించారు. ఈ సందర్భంగా ఈ-శ్రమ్‌పై అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి, సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ, ఆర్‌టీవో ఆర్.సురేష్, పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగాన్ని బలోపేతం చేయాలి

జిల్లాలో సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు శాఖల వారీగా అధికారులతో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో 19 శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరచడానికి రుణాలు మంజూరు చేయడం ద్వారా కౌలు రైతులకు, పాడి రైతులకు మేలు చేయాలని సూచించారు. సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్రం అమలు చేస్తున్న పథకాల పురోగతి, జిల్లా యంత్రాంగం చేపట్టిన కార్యక్రమాల వివరాలతో నివేదిక అందజేయాలన్నారు. ఆర్థిక లావాదేవీలపై కూడా నివేదిక ఇవ్వాలన్నారు. సహకార రంగంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు, జన్ ఔషధి షాపులపై ప్రతి నెలా పర్యవేక్షణ ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులు ఎం.జగన్నాథరావు, ఎస్.మాధవరావు, కె.శ్రీనివాసరావు, ఏలూరు జెడ్పీ సీఈవో సుబ్బారావు, కాకినాడ జెడ్పీ డిప్యూటీ సీఈవో రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

2019 అక్టోబర్ 15కు ముందు ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల్లో అభ్యంతరం లేని నివాస స్థలాలను క్రమబద్ధీకరిస్తామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. దీనికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉన్న కుటుంబాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కనీస విలువ చెల్లింపు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపడతామన్నారు. అర్హత ఉన్న వారు ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈ ఏడాది డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తగిన ఆధారాలు, డాక్యుమెంట్లతో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి, నిర్ధారణ చేసిన తరువాతే క్రమబద్ధీకరిస్తామని కలెక్టర్ తెలిపారు.

'కోడ్'లోనూ పక్షపాతం



కోటగుమ్మం సెంటర్లో ముసుగు వేసిన రాజశేఖరరెడ్డి విగ్రహం



పుష్కర ఘాట్‌లో ముసుగు లేకుండా కృష్ణుని రూపంలో ఎన్టీ రామారావు విగ్రహం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో సైతం అధికారులు పక్షపాతం చూపిస్తున్నారు. రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కోడ్ పేరుతో నిండా ముసుగు వేసేశారు. అదేమిటో కానీ.. అక్కడకు కాస్త దూరాన పుష్కరాల రేవు వద్ద రెండు బ్రిడ్జిల మధ్యలో కృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మాత్రం ఎన్నికల కోడ్ వర్తించదన్నట్లు అలానే వదిలేశారు. దీనిని గమనిస్తున్న ప్రజలు కోడ్ అమలులో ఈ పక్షపాతమేమిటంటూ విమర్శిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

ముద్రగడకు పలువురు నాయకుల సంఘీభావం



ముద్రగడ పద్మనాభం, గిరిబాబుతో మాట్లాడుతున్న విప్పర్తి వేణుగోపాలరావు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి గిరిబాబుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంఘీభావం తెలిపారు. మంగళవారం కిర్లంపూడిలోని ఆయన నివాసానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పిఠాపురం మున్సిపల్ చైర్మన్ సభ్యుడు గండేపల్లి రామారావు (బాబీ), మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కౌన్సిలర్లు, ప్రత్తిపాడు జెట్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి వెళ్లారు. ఈ సందర్భంగా విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం ఇంటిపై జరిగిన దాడి ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయన్నారు.

సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణ మహోత్సవాలలో సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఫెస్టివల్ చైర్మన్, అమలాపురం ఆర్డీవో కె.మాధవి అన్నారు. అంతర్వేది టూరిజం గెస్ట్ హౌస్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రధాన రోజులలో సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తూ, తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల మెరుగైన సౌకర్యాలు కల్పనకు తీర్థం జరిగే ఏరియాను ఆరు సెక్టార్లుగా విభజించి, అన్ని శాఖల అధికారులను భాగస్వామం చేస్తున్నామన్నారు. 7వ తేదీ ఉదయం ఆలయం వద్ద రూ.200 చొప్పున 1500 కల్యాణం టిక్కెట్లు పంపిణీ చేసే విధంగా చూస్తున్నామన్నారు. ఐదు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, వాటిలో 26 మంది మెడికల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారన్నారు. సమావేశంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

అంగరంగ వైభవం



అంతర్వేదిలో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తున్న అర్చకులు

- అంతర్వేదిలో లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవాలు ప్రారంభం
- భారీగా తరలివచ్చిన భక్తులు

అంతర్వేదిలో నేడు

అంతర్వేది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం సాయంత్రం గరుడు పుష్పక వాహనంపై, రాత్రి పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ స్వామివారి తిరువారాధన, ఆర్జిత అభిషేకం, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ సుదర్శన హోమం జరుగుతాయి.



అంతర్వేది రథాన్ని మెరక వీధికి తరలిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సూర్యభగవానుడు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో లక్ష్మీనృసింహస్వామివారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సూర్యభగవానుడి జన్మదినమైన రథసప్తమిని పురస్కరించుకుని స్వామివారిని వరుడిగా, అమ్మవారిని వధువుగా అలంకరించారు. ఏటా మాదిరి గానే ముద్రికాలంకరణ (శ్రీవారిని పెండ్లికుమారుని, అమ్మవారిని పెళ్లికుమార్తె చేసే కార్యక్రమం)ను కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాలు ఘనంగా నిర్వహించాయి. సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకులు శ్రీవారికి, అమ్మవారికి వైఖానస ఆగమానుసారం, శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రకారం విశేష పూజలు చేశారు. మామిడాకుల భస్మంతో బుగ్గన చుక్కపెట్టి, ఉంగరం తొడిగి పెండ్లికుమారుడు, పెళ్లికుమార్తెను చేసే తంతును పూర్తి చేశారు. కల్యాణోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రథానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆలయం నుంచి రథాన్ని గోవింద నామస్మరణల మధ్య మెరక వీధికి తోడ్కొని వెళ్లారు. ఉత్సవాల తొలి రోజు సాయంత్రం సూర్యవాహనంపై, రాత్రి చంద్ర ప్రభ వాహనంపైన కొలువు దీరిన స్వామి మాఢ వీధుల్లో ఊరేగారు. గ్రామోత్సవాల్లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వాడపల్లిలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దేవదాయధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు జరిపారు. వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమిని పురస్కరించుకుని మాఢ వీధుల్లో శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు.

గోవిందమాల దీక్షాధారణ

వాడపల్లి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో భక్తులు గోవిందమాల దీక్షా ధారణ (శ్రీనివాస శరణాగత దీక్ష) చేపట్టారు. ఈ నెల 26 వరకూ 21 రోజులు పాటు అర్ధ మండల దీక్ష చేస్తారు. వారికి డీసీ అండ్ ఈఓ చక్రధరరావు దీక్షా వస్త్రాలు, మాలలు ఉచితంగా సమకూర్చారు. అలాగే ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నారు.

జి.మామిడాడలో కన్నులపండువగా రథోత్సవం

పెదపూడి: రథసప్తమి పర్వదినం సందర్భంగా జి.మామిడాడలో సూర్యనారాయణమూర్తి రథోత్సవం ఘనంగా జరిగింది. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ ఉత్సవ మూర్తులతో కలిసి సూర్య భగవానుడు పల్లకీలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి, ఆలయ బయట ఉంచిన రథంలో ఆశీనులు చేశారు. అనంతరం అర్చకుల మంత్రోచ్ఛారణతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసు బాలకృష్ణారెడ్డి, ఆలయ ఈఓ పాటి సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జి.మామిడాడలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రిజర్వు ఫారెస్టులో అగ్ని ప్రమాదం



దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులో వ్యాపించిన మంటలు



ఆకాశంలో కమ్మేసిన పొగ

రాజానగరం: దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. జాతీయ రహదారిని అనుకుని గైట్ ఇంజినీరింగ్ కళాశాలకు ఎదురుగా ఉన్న బ్రిడ్జి కౌంటీకి వెనుక భాగంలో జరిగిన ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలోని ఆకాశంలో దట్టమైన పొగలు కమ్మేశాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ పి.ప్రశాంతి అటవీశాఖ, అగ్నిమాపక దళాలను అప్రమత్తం చేశారు. రాజమహేంద్రవరం, కోరుకొండ కేంద్రాల నుంచి సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది అధికారులు శ్రీనివాస్, మార్టిన్ లూథర్ కింగ్ ఆధ్వర్యంలో మంటలు విస్తరించకుండా నిరోధించగలిగారు. అగ్నిమాపక వాహనాలు లోపలకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో బ్లోయర్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఐదు హెక్టార్లకు మంటలు విస్తరించాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉండే ఈ ప్రాంతంలో ఆకతాయిలు కాల్చిపారేసిన సిగరెట్ కారణంగానే ప్రమాదం సంభవించి ఉండవచ్చని భావిస్తున్నారు. రాలిపోయి, దట్టంగా పడిన ఎండుటాకులు, పుల్లల వల్ల మంటలు వ్యాపించాయని, చెట్లకు, మనుషులకు నష్టం వాటిల్ల లేదని అటవీశాఖ శాఖ సిబ్బంది తెలిపారు.


విద్యార్థినిని వంచించిన లెక్చరర్ అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ దేవకుమార్, చిత్రంలో సీఐ విశ్వం

కొవ్వూరు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి విద్యార్థినిపై అత్యాచారం చేసిన జూనియర్ అధ్యాపకుడు వేదాల వినయ్ వర్ధన్ మంగళవారం పోలీసులకు లొంగిపోయాడు. ఆ వివరాలను డీఎస్పీ జి.దేవకుమార్ మంగళవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. రాజమహేంద్రవరం ఓ ప్రైవేటు కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న వినయ్ వర్ధన్ అదే కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొవ్వూరుకు చెందిన విద్యార్థినితో ప్రేమ వ్యవహారం నడిపాడు. వినయ్ వర్ధన్‌కు గతంలోనే వివాహమైంది. 2014లో భార్యతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తనకు పెళ్లి కాలేదని చెప్పి విద్యార్థినిని నమ్మించాడు. ఆమెను ఈ నెల 28వ తేదీ రాత్రి మోటారు సైకిల్ ఎక్కించుకుని విజయవాడలో లాడ్జికి తీసుకు వెళ్లాడు. అక్కడి నుంచి అనంతపురంతో పాటు పలు ప్రాంతాల్లో తిప్పాడు. బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 29న పట్టణ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా.. ఈ నెల 2వ తేదీన బాలిక కొవ్వూరుకు తిరిగి వచ్చింది. తనకు జరిగిన అన్యాయాన్ని కుటుంబ సభ్యులకు వివరించింది. వారి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు..అధ్యాపకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను పరీక్షల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మహిళా ఎస్సై ద్వారా వివరాలను నమోదు చేసి, బాలిక ఫోన్, సీసీ ఫుటేజీల సహకారంతో నిందితుడిని గుర్తించారు. అతడిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించడంతో సెంట్రల్ జైలుకు తరలించారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 – 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఇద్దరు అంతర జిల్లా దొంగల అరెస్టు

- రూ.40 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కృష్ణారావు



రాజోలు చోరీ కేసులో రికవరీ చేసిన సొత్తును చూపిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: ఇద్దరు అంతర జిల్లా నేరస్తులను పోలీసులు పట్టుకున్నారు. రాజోలులో జరిగిన ఓ చోరీ కేసుకు సంబంధించిన దర్యాప్తులో ఇద్దరిని అరెస్టు చేశారు. వారిని విచారణ చేయగా దాదాపు 25 నేరాలతో సంబంధం ఉందని తెలిసింది. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. రాజోలుకు చెందిన విశ్రాంత తెలుగు పండిట్ బాపన్న గుప్తా, కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 20న అన్నవరంలో జరుగుతున్న ఓ శాంతి సమావేశాలకు వెళ్లారు. అనంతరం గత నెల 24న ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే రూ.40 లక్షల బంగారు నగలు, వెండి వస్తువులు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, క్రైమ్ పార్టీ రంగంలోకి దిగాయి. నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరించి, పాత నేరస్తుల క్రైమ్ సస్పెక్ట్ షీట్ల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పాత నేరస్తులైన పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన గుబ్బల భాస్కర్, కొత్తపల్లి నరేష్ ఈ చోరీ చేసినట్టు గుర్తించారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరాన్ని అంగీకరించారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం, పాలకొల్లు, పెనుమంట్ర, పాలకోడేరు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, అమలాపురం, రావులపాలెం, రాజోలు గ్రామాల్లో చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారు. రాజోలులో దొంగిలించిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను నర్సాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామం శివారు నక్కావారిపేటలోని కాసువారి నాస్ గార్డెన్స్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, ఎస్సై బి.రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

అశ్లీల వీడియోల పేరుతో యువతికి బెదిరింపులు

- విడతల వారీగా రూ.2,53,76,000 కాజేసిన కేటుగాటు
- నాలుగేళ్ల నుంచి కొనసాగుతున్న వేధింపులు
- నిందితుడిని పట్టుకున్న పోలీసులు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్ము, ఆభరణాలు చూపుతున్న పోలీసులు

కొవ్వూరు: అశ్లీల వీడియోల పేరుతో యువతిని బెదిరిస్తూ నాలుగేళ్ల నుంచి డబ్బులు గుంజుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసు వివరాలను మంగళవారం సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో డీఎస్పీ జి.దేవకుమార్ వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. నిడదవోలుకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న గాయత్రీ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ విప్రో కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అదే హాస్టల్‌లో ఉంటున్న కాజా అనూషాదేవితో ఆమెకు పరిచయం ఏర్పడింది. గుంటూరు జిల్లా ఓబులనాయుడుపాలేనికి చెందిన నీనావత్ దేవా నాయక్ అలియాస్ మధు అనే వ్యక్తిని అనూషాదేవి వివాహం చేసుకుంది. ఈ నేపథ్యంలో స్నేహితురాలికి తన భర్తను పరిచయం చేసింది. అనూషాదేవితో ఉన్న పరిచయం, ఒకే హాస్టల్లో ఉండడంతో బాధితురాలు ఆమెతో అత్యంత సన్నిహితంగా ఉండేది. దీంతో దేవ నాయక్ వేరే వ్యక్తి ఫోన్ చేసినట్లుగా బాధితురాలికి ఫోన్ చేసి తన వద్ద ఆమె న్యూడ్ వీడియోలున్నాయని, వాటిని ఇంటర్నెట్‌లో పెడతానని బెదిరించారు. అలా చేయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. విడతల వారీగా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు వేయించుకునేవాడు. ఇలా కూడబెట్టిన సొమ్ముతో చిన్న కాకానిలో అపార్ట్‌మెంటు కొనుగోలు చేశాడు. కారు, బుల్లెట్, పెద్ద ఎత్తున బంగారం, వెండి ఆభరణాలు కొనుగోలు చేశాడు. కాగా..తనను ఒక వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేస్తున్న విషయాన్ని అనూషాదేవికి బాధితురాలు తెలిపింది. ఈ విషయం మళ్లీ దేవానాయక్ దృష్టికి వెళ్లింది. వేరొకరి ద్వారా సెటిల్‌మెంట్ చేసినట్లు బాధితురాలిని నమ్మించాడు. అలాగే పలు అవసరాల కోసం బాధితురాలి దగ్గర డబ్బులు కాజేశాడు. కాగా.. అనూషాదేవి, ఆమె భర్త దేవానాయక్‌లు తనను మోసం చేస్తున్నారని బాధితురాలు గుర్తించింది. దీంతో తల్లిదండ్రులతో కలిసి నిడదవోలు పోలీసులను ఆశ్రయించింది. ఇలా ఆమె 2021 నుంచి 2025 వరకూ దాదాపు రూ.2,53,76,000 మోసపోయింది. మరో రూ.14 లక్షలు డిమాండ్ చేయడంతో పోలీసులను ఆశ్రయించింది.

మూడు రోజుల్లో కేసు ఛేదన

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మూడు రోజుల్లో దేవా నాయక్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి రూ.1,81,45,000 విలువైన 938 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.250 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.75 లక్షల నగదు, కారు, బుల్లెట్ స్వాధీనం చేసుకున్నారు. చిన్నకాకానిలో కొనుగోలు చేసిన అపార్ట్‌మెంటును స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా స్వాధీనం పర్చుకున్నారు.

మంచి జీవన శైలితో క్యాన్సర్‌ను జయించవచ్చు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి మంచి ఆహారపు అలవాట్లు, సరైన వ్యాయామం, ఒత్తిడిలేని జీవనశైలి చాలా అవసరమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక డెల్టా ఆసుపత్రిలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెల్టా క్యాన్సర్ సెంటర్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొందరగా గుర్తించడం ద్వారా వైద్య చికిత్సలు సమర్థవంతంగా అందించవచ్చన్నారు. దీనికి ప్రజలు తరచుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్‌కు ప్రధాన కారకమైన పొగాకు, పొగాకు ఉత్పత్తులను పూర్తిగా నివారించాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ రిమ్మలపూడి భాస్కర్ చౌదరి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నితిన్ రిమ్మలపూడి, డాక్టర్ ఫణీంద్ర పాల్గొన్నారు.

8న మాదిగ సామాజికవర్గ వివాహ పరిచయ వేదిక

రాజమహేంద్రవరం సిటీ: ఎకనామిక్ టైమ్స్ మహా డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన మాదిగ సామాజికవర్గ వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నారు. ఆ సంస్థ సభ్యుడు పెందుర్తి సునీల్ మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పరిచయ వేదికలో పాల్గొనే వారి నుంచి ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజులు, కమీషన్లు వసూలు చేయడం లేదన్నారు. మరిన్ని వివరాలకు లంకే వెంకటేశ్వరరావు 98663 60242, పెందుర్తి సునీల్ 91600 01117ను సంప్రదించాలన్నారు.

బాబోయ్ దొంగలు

- అచ్చన్నపాలెంలో 48 కాసుల బంగారం, రూ.2 లక్షల చోరీ
- పేరూరు జంక్షన్‌లో రూ.1.50 లక్షల అపహరణ

నల్లజర్ల: అచ్చన్నపాలెంలోని ఓ రైతు ఇంట్లో 48 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలను దొంగలు దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన వట్టికూటి సీతారామకృష్ణ, ఆయన భార్య సోమవారం రాత్రి తమ ఇంట్లోని మధ్య గదిలో నిద్రకు ఉపక్రమించారు. ఆ గది వెనుక ఉన్న మరో గదిలో బీరువా ఉంది. అర్ధరాత్రి తర్వాత దొంగలు.. పెరట్లో జామకాయలు కోసేందుకు ఉపయోగించే ఇనుప ఊచకు మరో కర్ర తగిలించి కిటికిలోంచి దాదాపు 10 అడుగుల దూరంలో ఉన్న తలుపు గడియను తెరిచి ఇంట్లోకి ప్రవేశించారు. అక్కడున్న బీరువాకే తాళాలు తగిలించి ఉంచడంతో దాన్ని తెరిచి, 48 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు దోచుకెళ్లారు. ఎటువంటి ఆధారాలు దొరక్కుండా గది అంతా కారం చల్లారు. మంగళవారం ఉదయం నిద్ర లేచేసరికి పెరటివైపు తలుపు తెరచి ఉండడంతో చోరీ జరిగినట్టు సీతారామకృష్ణ దంపతులు గుర్తించారు. సమాచారం అందుకున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, క్రైం ఏఎస్పీ ఎల్.అర్జున్, నల్లజర్ల సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. దొంగలను పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు క్రైం ఏఎస్పీ అర్జున్ తెలిపారు.

మోటారు సైకిల్ డిక్కీలో రూ.1.50 లక్షల చోరీ

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం సమీపంలోని పేరూరు వై.జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారి చెంతన పార్కు చేసి ఉన్న మోటారు సైకిల్ డిక్కీలోంచి రూ.1.50 లక్షలను దొంగలు చోరీ చేశారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. అనపర్తి మండలం కుతుకులూరుకి చెందిన సత్యనారాయణరెడ్డి అమలాపురం, పరిసర గ్రామాల్లో డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తారు. ఇలాగే తన సన్నిహితుడితో కలిసి వసూలు చేసిన నగదును కవర్‌లో పెట్టి, తన మోటారు సైకిల్‌లో డిక్కీలో దాచారు. అనంతరం వై.జంక్షన్‌లోని ఒక హోటల్ ముందు మోటారు సైకిల్‌ను పార్కింగ్ చేసి టిఫిన్ చేసేందుకు వెళ్లారు. ఇంతలో ఇద్దరి యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి సత్యనారాయణరెడ్డి మోటారు సైకిల్ డిక్కీలోని నగదును తీసుకుని వెళ్లిపోయారు. హోటల్ నుంచి బయటకు వచ్చిన సత్యనారాయణరెడ్డి తన నగదు పోయిన విషయాన్ని గుర్తించి, దొంగల కోసం చుట్టుపక్కల గాలించారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ పి.వీరబాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు.